ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 12 సెప్టెంబరు 2025



ఆటో కార్మికులకు పండగ

- రూ.15వేల సాయం అందించనున్న ప్రభుత్వం
- అక్టోబరు 2న వారి ఖాతాల్లో జమ
- ఇప్పటికే హరిత పన్నును తగ్గించిన వైనం



6లో

జేసీగా యశ్వంత్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు



జేసీగా బాధ్యతలు స్వీకరించిన యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి గురువారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు డీఆర్వో కె.హేమలత తదితరులు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అసోసియేషన్ నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడలకు సంబంధించిన కరపత్రా లను డీఆర్వో, రెవెన్యూ అసోసియేషన్ అధ్య క్షుడు జి.శ్రీరామ్మూర్తి, ఇతర అధికారులతో కలిసి జేసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, ఐటీడీఏ ఏపీవో ఎ.మురళీధర్, తహసీల్దార్ సురేష్, కలెక్టర్ కార్యాలయ పరిపాలనా ధికారి చిన్నారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా కూడా..

పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిగా జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి గురు వారం సాయంత్రం బాధ్య తలు స్వీకరించారు. ప్రస్తుత ఇన్‌చార్జి పీవోగా సబ్ కలెక్టర్ వైశాలి విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా జరిగిన బదిలీల్లో భాగంగా జాయింట్ కలెక్టర్ బాధ్యతతో పాటు ఇన్‌చార్జి పీవో బాధ్యతను కూడా యశ్వంత్‌కుమార్ రెడ్డికి ప్రభుత్వం అప్పగించింది. ఆయనకు ఐటీడీఏ ఏపీవో మురళీధర్, ఏఏవో ప్రసాద్, పలువురు గిరిజన నాయకులు స్వాగతం పలికారు.

కొత్త కలెక్టర్‌గా ప్రభాకర్‌రెడ్డి

- శ్యామ్‌ప్రసాద్ బదిలీ

పార్వతీపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీసీఎల్ఏలో విధులు నిర్వహిస్తున్న ఎస్.ప్రభాకర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తరువాత రెండో కలెక్టర్‌గా శ్యామ్‌ప్రసాద్ వచ్చారు. విద్య, వైద్యం, రహదారులు తదితర మౌలిక వసతుల కల్పనపై యన ప్రత్యేక దృష్టిసారించారు. గిరిజన గ్రామాల్లో పర్యటించడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించారు. కంటైనర్ ఆసుపత్రులు, నిత్యావసర సరుకులు సరఫరా కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయడంలో కీలకంగా వ్యవహరించారు.



ప్రస్తుత కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- జిల్లా మూడో కలెక్టర్‌గా ప్రభాకర్‌రెడ్డి త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన ప్రస్తుతం సీసీఎల్ఏలో జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభాకర్‌రెడ్డిది సాధారణ రైతు కుటుంబం. బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్ ఫిలాసఫీతో పాటు గణితంలో పీహెచ్‌డీ, సైన్స్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ డిగ్రీలు పొందారు. గతంలో భూ పరిపాలన అదనపు కమిషనర్, సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డర్‌గా, ఆంధ్రప్రదేశ్ క్రీడాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆయన విధులు నిర్వహించారు. కడప, ఆదోనీలో ఆర్డీవోగా పనిచేసిన సమయంలో బాల్య వివాహాల నివారణ, యువత సాధికారితకు చేసిన కృషికి గాను ఆయన 2013లో గవర్నర్ ఎస్.ఎల్.నరసింహ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. సీఆర్‌డీఏలో డైరెక్టర్‌గా అమరావతి భూసేకరణ పథకం అమల్లో కీలకపాత్ర పోషించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈవోఆర్ఎస్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసి, దేశంలోనే మొదటిసారి ఈ ప్రాజెక్టును ఆయన విజయవంతం చేశారు. నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించేటప్పుడు 32 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. జిల్లా కలెక్టర్‌గా శనివారం విధుల్లో చేరనున్నట్లు సమాచారం.



నూతన కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

- కానరాని డంపింగ్ యార్డు తరలింపు
- ఇప్పటికి రెండుసార్లు ప్రయత్నించి వదిలేసిన వైనం
- దుర్వాసనతో పార్వతీపురం పట్టణ ప్రజల ఇబ్బందులు
- గొప్పలకే పరిమితమైన వైసీపీ ప్రభుత్వం
- కూటమి సర్కారుపైనే ఆశలు



అంతర్రాష్ట్ర రహదారిపైకి వస్తున్న డంపింగ్ యార్డులోని చెత్త

ఎన్నాళ్లీ నరకం?

పార్వతీపురంటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాయగడ అంతర్రాష్ట్ర రోడ్డు శివారులో ఉన్న డంపింగ్ యార్డుతో పార్వతీపురం పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డు నుంచి వస్తోన్న తీవ్ర దుర్వాసన వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అంతరాష్ట్రపై రాకపోకలు సాగించే పాదచారులు, వాహనచోదకులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. డంపింగ్ యార్డుకు ఆనించి ఉన్న గోపసాగరం కలుషితం అవుతుంది. తరచూ చెత్త, వ్యర్థాలు రహదారికి పైకి వస్తుండడంతో స్థానికులు నరకం చూస్తున్నారు. డంపింగ్ యార్డు తరలింపునకు 15 ఏళ్ల కిందట అప్పటి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు తీర్మానం చేసినా అది కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత మరోసారి అధికారులు ప్రణాళికలు తయారు చేసినా మళ్లీ అదే పరిస్థితి. దీనిపై జిల్లా కేంద్రవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మునిసిపాలిటీగా ఏర్పడినప్పుడు రాయగడ రోడ్డు శివారులో ఐదు ఎకరాల్లో డంపింగ్ యార్డును అప్పటి అధికారులు ఏర్పాటు చేశారు. అప్పటి జనాభాకు తగ్గట్టుగా, పట్టణానికి దూరంగా డంపింగ్ యార్డు ఉండడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. అయితే, ప్రస్తుతం పార్వతీపురం పట్టణం విస్తరించింది. జిల్లా కేంద్రంగా మారింది. డంపింగ్ యార్డుకు సమీపంలో వివేకానంద కాలనీ తదితర కాలనీలు ఏర్పడ్డాయి. దీంతో యార్డు నుంచి వస్తున్న దుర్వాసనతో ఈ కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కంపు కారణంగా ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నామని వాపోతున్నారు. భూగర్భ జలాలు కూడా కలుషితం అవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. బోర్ల నుంచి వచ్చే నీరు దుర్వాసన వెదజల్లుతుందని, ఆ నీటిని తాగి డయేరియా లాంటి వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్

(మిగతా 8వ పేజీలో..)

రెండుసార్లు ఆగిన తరలింపు..

డంపింగ్‌యార్డు తరలింపునకు 2008లో అప్పటి పాలకవర్గ సభ్యులు తీర్మానం చేశారు. దీనికోసం పార్వతీపురం మండలం సంగంవలస పంచాయతీ పిట్టలవలస వద్ద 5 ఎకరాలను రెవెన్యూ అధికారులు కేటాయించారు. అలాగే, అప్రోచ్ రోడ్డు కోసం రూ.20 లక్షలు కేటాయించారు. ఈ మేరకు 2009లో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు యార్డు తరలింపు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే డంపింగ్ యార్డుతో తాము రోగాల బారిన పడతామని, సంగంవలస పంచాయతీలోని గ్రామాల ప్రజలు నిరసనలు, ధర్నాలు చేపట్టారు. దీంతో డంపింగ్ యార్డు తరలింపును అధికారులు నిలుపుదల చేశారు. మళ్లీ 2014లో డంపింగ్ యార్డు తరలింపుపై మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. సంగంవలస పంచాయతీ రావికో, బట్టివలస గ్రామాల సమీపంలో 5 ఎకరాల్లో డంపింగ్ యార్డుతోపాటు చెత్తశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి స్థలాన్ని సేకరించారు. భూమి పూజ చేస్తారనే సమయానికి ప్రజా, గిరిజన సంఘాలు, వామపక్షాలు అడ్డుకోవడంతో మళ్లీ కథ మొదటికొచ్చింది.

- వైసీపీ ప్రభుత్వంలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు డంపింగ్ యార్డు తరలిస్తామని గొప్పలు చెప్పారు. రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి గరుగుబిల్లి మండలం సుంకి, సంతోషపురం, తదితర గ్రామాల వద్ద స్థలాలను పరిశీలించారు. అయితే, ఆయా గ్రామాల నుంచి వ్యతిరేకత రావడంతో వారు చేతులు ఎత్తేశారు. కూటమి ప్రభుత్వమైనా డంపింగ్ యార్డును తరలిస్తుందనే ఆశతో ప్రజలు ఉన్నారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- డీఆర్వో హేమలత



మాట్లాడుతున్న డీఆర్వో హేమలత

పార్వతీపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కింద సారా రహిత జిల్లాగా పార్వతీపురాన్ని తీర్చిదిద్దాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖాధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారుల సమష్టి కృషితోనే సారా నిర్మూలన సాధ్యమన్నారు. జిల్లాకు సమీపంలో ఒడిశా సరిహద్దు ప్రాంతాలు ఉన్నందున అంతర రాష్ట్ర తనిఖీలను మరింత విస్తృతం చేయాలని అన్నారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు మాట్లాడుతూ.. జిల్లాలో 137 గ్రామాలను ఏబీసీ గ్రామాలుగా వర్గీకరించి ఆ గ్రామాలకు దత్తత అధికారులను నియమించినట్లు తెలిపారు. పోస్టర్లు, కరపత్రాలు, ప్రచార రథం ద్వారా నవోయదయ 2.0పై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామన్నారు. గత నాలుగు మాసాల్లో 227 కేసులు పెట్టి 337 మందిని అరెస్టు చేశామన్నారు. 9,090 లీటర్ల సారాను, 35,740 పులియ బెట్టిన నల్లబెల్లాన్ని ధ్వంసం చేసినట్టు తెలిపారు. 38 వాహనాలను సీజ్ చేశామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విశాఖ ఎయిర్‌పోర్టులో బాధితులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

హమ్మయ్య వచ్చేశారు

- నేపాల్ నుంచి క్షేమంగా తిరిగొచ్చిన జిల్లా వాసులు
- కఠ్మాండూ ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో విశాఖకు రాక

గుమ్మలక్ష్మీపురం/పార్వతీపురంటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న జిల్లా యాత్రికులు గురువారం రాత్రి క్షేమంగా స్వస్థలాలకు తిరిగొచ్చారు. పార్వతీపురం, విజయనగరం జిల్లాలకు చెందిన సుమారు 60 మంది యాత్రికులు నేపాల్ పోలీసుల బందోబస్తు మధ్య గురువారం ఉదయం కఠ్మాండూ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో తమకు ఆహారాన్ని సమకూర్చారని గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన యాత్రికుడు నెమలిపురి వెంకట్ తెలిపారు. ఇండియా నుంచి విమానం వచ్చిన వెంటనే తమను అందులో ఇండియన్ ఎంబసీ అధికారులు ఎక్కించినట్లు చెప్పారు. గురువారం రాత్రి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న వారికి పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర స్వాగతం పలికారు. బాధితులతో మాట్లాడి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విశాఖ విమానాశ్రయం నుంచి జిల్లాకు వచ్చేందుకు బాధితులకు వాహనాలు సమకూర్చారు. అలాగే, భోజన సౌకర్యం కూడా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు కష్ట, సుఖాల్లో తోడు ఉంటుందని అన్నారు. తాము క్షేమంగా వచ్చేందుకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు అని బాధితులు అన్నారు.

నిధులు మంజూరైనా.. నత్తనడకనే!

- పూర్తికాని కురుపాం, గుమ్మలక్ష్మీపురం ఆసుపత్రుల పనులు
- మార్చి నాటికి నూతన భవనాలు అప్పగిస్తామన్న అధికారులు
- రోగులను వేధిస్తున్న వసతి సమస్య

జియ్యమ్మవలస, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాల నూతన భవనాల పనులు ఊపందుకోవడం లేదు. ప్రభు త్వం బిల్లులు చెల్లిస్తున్నా.. నిర్మాణాలు నత్తనడకన సాగుతుండడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. మరో వైపు రోగులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. వాస్తవంగా 50 పడకలున్న ఆయా సీహెచ్‌సీలకు రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. నిత్యం వైద్య సేవల కోసం దూర ప్రాంతాల నుంచి గిరిజనులు వస్తుంటారు. అయితే ప్రస్తుతం ఆసుపత్రుల పాత భవనాల్లో వైద్య సేవలు అందిస్తున్నా.. మౌలిక వసతుల కొర తతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఇన్‌పేషెంట్లుగా చేరుతున్న వారు ఏదో ఒక చోట సర్దుకుని వైద్య సేవలు పొందాల్సి వస్తోంది. కొన్నిసార్లు ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు పేషెంట్లు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.



కురుపాం సీహెచ్‌సీలో ఒక్కొక్క మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులు ఉన్న దృశ్యం



కురుపాంలో నూతన ఆసుపత్రి భవనం

గత వైసీపీ ప్రభుత్వం.. కురుపాం ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి రూ.3 కోట్లు, గుమ్మలక్ష్మీపురం సీహెచ్‌సీ పనులకు రూ. 8.95 కోట్లు మంజూరు చేసింది. ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) ఇంజనీరింగ్ విభాగానికి నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. అయితే సకాలంలో బిల్లులు అందకపోవడంతో పనులు నత్తనడకన జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెండింగ్ బిల్లులు చెల్లించింది. ఆ తర్వాత చేపట్టిన పనులకూ చకచకా బిల్లులు చెల్లిస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది మార్చి నాటికి ఆ రెండు భవనాలను జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారులకు అప్పగించాల్సి ఉంది. అయితే నేటికీ అందుబాటులోకి రాకపోగా.. ఇంకా పనులు పెండింగ్‌లో ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా (మిగతా 8వ పేజీలో..)

మొదలైంది.. దసరా సంత!

6లో



సేంద్రియ ఎరువులను వినియోగించండి

- ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

6లో

ఇంజక్షన్ వికటించి వివాహిత మృతి

7లో

సిరిమానోత్సవానికి నేడు అంకురార్పణ

- చదురు, వనంగుడుల వద్ద పందిరిరాట
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవదాయ శాఖ

6లో



వచ్చేది తక్కువ.. వదిలేది ఎక్కువ

- తోటపల్లి నుంచి 6,500 క్యూసెక్కుల నీరు విడుదల

గరుగుబిల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. గురువారం పైప్రాంతాల నుంచి 3,200 క్యూసెక్కుల వరద చేరగా, స్పిల్‌వే గేట్ల నుంచి నది దిగువ ప్రాంతాలకు 6,500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. పైనుంచి వచ్చే ప్రవాహం తక్కువగా ఉండగా, విడుదల చేసేది ఎక్కువగా ఉంది. ప్రాజెక్టులో 105 మీటర్ల సామర్థ్యానికి గాను 104.08 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. అలాగే 2.534 టీఎంసీలకు గాను 1.950 టీఎంసీల సామర్థ్యం ఉంది. సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన కాలువల నుంచి 1,320 క్యూసెక్కులను సరఫరా చేస్తున్నారు. వచ్చిన వరద ప్రవాహం కంటే అధికంగా నీటిని విడుదల చేయడంతో వృథాగా సముద్రంలో కలుస్తున్న పరిస్థితి ఏర్పడింది.



ప్రాజెక్టు నుంచి దిగువకు నీరు విడుదల చేసిన దృశ్యం

ఆటో కార్మికులకు పండగ



గజపతినగరం స్టాండ్‌లో ఉన్న ఆటోలు

- రూ.15వేల సాయం అందించనున్న ప్రభుత్వం
- అక్టోబరు 2న వారి ఖాతాల్లో జమ
- ఇప్పటికే హరిత పన్నును తగ్గించిన వైనం

గజపతినగరం/విజయనగరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికులపై ప్రభుత్వం వరాలు కురిపించింది. అర్హత కలిగిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.15వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించారు. గత నెల 15వ తేదీ నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారు. దీని వల్ల తమ కుటుంబాలకు ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులపై ఆటో కార్మికులు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. అదే సమయంలో ఉచిత ప్రయాణం అమలు నేపథ్యంలో ఆటో కార్మికులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ఇటీవల భరోసా ఇచ్చారు. ఈ మేరకు అక్టోబరు 2న విజయ దశమి రోజున ఒక్కో ఆటో యజమాని ఖాతాలో రూ. 15 వేల చొప్పున వేయనున్నట్టు ప్రకటించారు. దీంతో వేలాది మంది ఆటో కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో సుమారు 15 వేల ఆటోలు ఉన్నట్లు రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. ఆటో యజమానులు మాత్రం 16వేలకు పైగా ఉన్నట్లు చెబుతున్నారు. మన జిల్లాకు సంబంధించి గతంలో వైసీపీ ప్రభుత్వం 14,568 మందికి సాయం అందించింది. ఈ ఏడాదిన్నరలో ఆటోలు పెరిగాయి. దీంతో లబ్ధిదారుల సంఖ్య 15 వేలకు పైగా ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ పథకం అమలుకు జిల్లాలో సుమారు రూ.22కోట్ల వరకు అవసరం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లకు రూ.10 వేల వంతున సాయాన్ని అందించారు. అది కూడా అనేక ఆంక్షలతో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించారు. ఆటో కార్మికుల అకౌంట్లలో రూ.10 వేలు జమ చేసిన కొన్ని రోజులకే అప్పటి ప్రభుత్వం ఆర్టీఓలను రంగంలోకి దించింది. చలానాలు, రవాణా శాఖ నిబంధనల పేరుతో రకరకాలుగా అపరాధ రుసుములు విధించింది. ఈ చేతితో ఇచ్చి.. ఆ చేతితో లాగేసుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న పథకానికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేయనుంది. సొంత ఆటోలు ఉన్న వారే కాక... అద్దెకు తీసుకొని నడుపుతున్న వారూ చాలామంది ఉన్నారు. సొంత ఆటో లేని కార్మికులకు సాయం ఉంటుందా? లేదా? అనే దానిపై త్వరలో స్పష్టత రానుంది.

శుభ పరిణామం..

ఆటో కార్మికులకు దసరా కానుకగా రూ.15 వేలు అందిస్తామని చెప్పడం శుభ పరిణామం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో ఆటోలకు గిరాకీ తగ్గింది. మా గోడును పట్టించుకోవాలని కోరాం. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. మా కోసం ప్రత్యేక పథకం పెట్టడం చాలా ఆనందంగా ఉంది.

-రామినేని భాస్కరరావు, ఆటో కార్మికుడు, గజపతినగరం

మార్గం చూపించారు..

సీఎం చంద్రబాబు పెద్ద మనసుతో రూ.15 వేల లెక్కన సాయం ప్రకటించారు. ఇది హర్షించదగ్గ పరిణామం. ఆటోలపై ఆధారపడి వేలాది మంది బతుకుతున్నారు. అటువంటి వారికి మార్గం చూపించినట్టయ్యింది. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో పెట్టిన పథకాన్ని ఏటా కొనసాగించాలి.

-మద్దిల కృష్ణ, ఆటో కార్మికుడు, విజయనగరం

హరిత పన్ను తగ్గింపు..

ప్రజలను ఎడాపెడా పన్నులతో బాదేయడమే పనిగా పెట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం ఏటా వాహనదారుల నుంచి రూ.కోట్లలో పిండేసింది. హరిత పన్ను పేరుతో ఎవరినీ వదలకుండా రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. వాహనం రిజిస్ట్రేషన్ చేసిన నాటి నుంచి ఏడేళ్లు దాటితే వాటి నుంచి హరిత పన్ను పేరుతో రూ.200 వరకు మాత్రమే కట్టించుకునేవారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హరిత పన్నును భారీగా పెంచేసింది. 2022 జనవరి 1వతేదీ నుంచి వివిధ స్లాబ్‌లుగా విడదీసి పన్నులు విధించింది. 7 నుంచి పదేళ్లయితే సగం త్రైమాసిక పన్ను విలువ, వాహనం వయస్సు 10 నుంచి 12 ఏళ్లు దాటితే రెండు త్రైమాసికాల పన్ను విలువ పెంచేసింది. వాహనాలపై భారీగా పన్నుల భారం పడింది. దీంతో వాహనదారులంతా ఆందోళనలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో హరిత పన్ను దోపిడీ గురించి తెలుసుకున్న చంద్రబాబు ఈ ఏడాది మేలో రవాణా, రవాణాయేతర వాహనాలపై హరిత పన్ను తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆటో కార్మికులపై భారీగా పన్ను భారం తగ్గింది.

ఆటో డ్రైవర్లలో ఆనందోత్సాహాలు..

ప్రభుత్వ ప్రకటనతో ఆటో కార్మికుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. ప్రభుత్వం అందజేసే మొత్తం వాహన బీమా, టైర్ల మార్పులు, ఇంధన ఖర్చులు, కుటుంబ అవసరాలకు ఉపయోగపడతాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివిధ అవసరాల నేపథ్యంలో కొంతలో కొంతైనా సాయం అవుతుందని అంటున్నారు. సాధారణంగా ఆటో డ్రైవర్లు రోజువారీ ఆదాయంపైనే ఆధారపడతారు. ఇంధన ధరలు పెరగడం, వాహన నిర్వహణ ఖర్చులు ఎక్కువ కావడం వల్ల చాలామంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో తమ సమస్యలు కొంతవరకు ఒడ్డెక్కుతాయని వీరంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సిరిమానోత్సవానికి నేడు అంకురార్పణ

- చదురు, వనంగుడుల వద్ద పందిరిరాట
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవదాయ శాఖ



పైడితల్లి

విజయనగరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ సిరిమానోత్సవానికి శుక్రవారం అంకురార్పణ జరగనుంది. దసరా తరువాత వచ్చే మంగళవారం పైడిమాంబ సిరిమానోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ క్రమంలో సిరిమానోత్సవానికి నాందిగా భావించే పందిరిరాట వేసే కార్యక్రమాన్ని శుక్రవారం సంప్రదాయ బద్ధంగా నిర్వహించనున్నారు. మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి, రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడిల వద్ద ఈ కార్యక్రమం జరగనుంది. ఉదయం 9 గంటలకు మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి, 9.30 గంటల ప్రాంతంలో రైల్వేస్టేషన్ వద్ద గల వనంగుడిలో పందిరిరాట వేయనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయ ఈవో కె.శిరీషతో పాటు అర్చకులు, సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరు కానున్నారు. ఆమెతో పాటు పైడిమాంబ భక్తులు, నగర ప్రముఖులు అధిక సంఖ్యలో హాజరుకానున్న దృష్ట్యా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మండల దీక్షలు ప్రారంభం..

పైడిమాంబ భక్తుల మాలధారణ కార్యక్రమం కూడా శుక్రవారం ప్రారంభం కానుంది. మండల, అర్ధ మండల దీక్షలు నిర్వహించేందుకు పైడిమాంబ ఆధ్యాత్మిక సేవా సంఘం నిర్ణయించింది. ఈ మేరకు పందిరిరాట వేసే కార్యక్రమం పూర్తయిన వెంటనే పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడిలో పైడిమాంబ భక్తులు మాలధారణ చేయనున్నారు.

ప్రత్యేక అలంకరణ..

పైడిమాంబ ఆలయాల వద్ద శుక్రవారం పందిరిరాట వేసే కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పైడిమాంబను ప్రత్యేకంగా అలంకరించనున్నారు. ఆలయాన్ని కూడా విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

అలకల్లోలం



ముక్కాం గ్రామానికి చేరువగా వచ్చిన కెరటాలు

భోగాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాతావరణ మార్పుల కారణంగా గురువారం సముద్రం అల్లకల్లోలంగా మారింది. వేకువజాము నుంచి రాకాసి అలలు తీరాన్ని తాకుతున్నాయి. జిల్లాలో తీర ప్రాంత మండలాలైన భోగాపురం, పూసపాటి రేగ పరిధిలో సుమారు 29 కిలోమీటర్ల వరకు సముద్ర తీరం ఉంది. తీరం వెంబడి సుమారు 21 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. రాకాసి కెరటాలను చూసి ఈ గ్రామాల ప్రజలు భీతిల్లుతున్నారు. కెరటాలు ఇంతకుముందు లేనంత ఎత్తుకు ఎగసిపడడంతో పాటు... సముద్రం సుమారు 15 మీటర్ల వరకు ముందుకొచ్చింది. దీంతో ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు, చింతపల్లి, తిప్పలవలస గ్రామాల ప్రజలు హడలిపోయారు. ఉదయం నుంచి ఆందోళనకు గురిచేసిన సాగరం మధ్యాహ్నం 3 గంటల తరువాత కొంత శాంతించింది. కెరటాల ఉధృతి కొంతవరకు తగ్గింది. దీంతో మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు.



భక్తులతో కలసి నగర సంకీర్తనలో పాల్గొన్న దత్త విజయానంద తీర్థ స్వామీజీ

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామిజీ

రేగిడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్సంగాలతో ఆధ్యాత్మిక భావం పరిమళిస్తుందని... అది మానసిక ప్రశాంతతను ఇస్తుందని... ఆ దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని మైసూరు సచ్చిదానంద దత్తపీఠం ఉత్తరాధికారి దత్తవిజయానంద తీర్థ స్వామీజీ పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా చేసే నగర సంకీర్తనలతో మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. రేగిడి దత్తపీఠంలో గురువారం నిర్వహించిన ఆధ్యాత్మిక సదస్సులో స్వామిజీ అనుగ్రహ భాషణం చేశారు. సత్సంగాలతో మనిషిలో మంచి ప్రవర్తన, భక్తిభావం వికసిస్తుందన్నారు. నామసంకీర్తన, నగర సంకీర్తనలతో లోక కల్యాణంతో పాటు వ్యక్తిగతంగానూ మంచి జరుగుతుందని హితవు పలికారు. అంతకు ముందు స్వామీజీ ఆధ్వర్యంలో భక్తులు స్థానికంగా నగర సంకీర్తనలో పాల్గొన్నారు. రేగిడి గ్రామ పరిసరాలు దత్త నామస్మరణతో మారుమోగాయి. అనంతరం స్థానిక శివాలయంలో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక దత్తపీఠం బాధ్యతలు చూస్తున్న సూరపనాయుడు, రేగిడి సర్పంచ్ రవికుమార్, కిమిడి గణపతిరావు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వినియోగించండి

- ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టి సారించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. సోమగండిలో గురువారం నిర్వహించిన ఔట్ రీచ్ కార్యక్రమాన్ని పీవో పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ యూరియాతో పాటు సేంద్రియ ఎరువులను ఎక్కువగా వాడాలని సూచించారు. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం వల్ల నాణ్యతతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. యూరియాను అవసరమైనంత మేరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన పీవో... అక్కడి చిన్నారులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పీవోతో పాటు ఏపీవో చిన్నబాబు, తహసీల్దార్ శ్రీకన్య, ఏవో వాహిని తదితరులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కమిటీ సభ్యులు

క్రీడా పోటీలకు ఎంపిక

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జిల్లా స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికల ఫుట్‌బాల్ ఎంపికలు గురువారం నిర్వహించారు. ఈ ఎంపికలకు 500 మంది హాజరు కాగా, 72 మంది ఎంపికయ్యారు. అలాగే కోడి రామమూర్తి వ్యాయామ కళాశాలలో అండర్-17 బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 60మంది పాల్గొనగా... 16 మంది ఎంపికయ్యారు. విజ్జీ స్టేడియంలో అండర్-14, 17 బాలబాలికల ఫెన్సింగ్ ఎంపికలు నిర్వహించారు. 120 మంది క్రీడాకారులు హాజరు కాగా, 48మంది ఎంపికయ్యారు. ఫెన్సింగ్ సెలక్షన్ కమిటీ సభ్యులుగా బంగార్రాజు, వీవీఎస్ఎన్ రాజు, సోదామణి, మాధవ్‌లు వ్యవహరించారు. ఫుట్‌బాల్ సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఆదిలక్ష్మి, సీహెచ్ ఆదిలక్ష్మి, నాయుడు, శ్రీనివాసరావులు వ్యవహరించారు. వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు శివకుమార్, అనూరాధ, శ్రీనివాసరావు, సెలక్షన్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

మొదలైంది.. దసరా సంత!

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు ఊరూవాడా ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నాయి. దసరా పండగ సమయంలో మేకలు, గొర్రెల మాంసానికి ఉన్న డిమాండ్ తెలిసిందే. దసరా సమీపించే కొద్దీ వీటి ధరలు ఆకాశాన్ని తాకుతాయి. దీంతో నెల రోజుల ముందు నుంచే వీటిని కొనుగోలు చేసేందుకు రైతులు, ప్రజలు ఆసక్తి చూపిస్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగే సంతల్లో వీటిని ఎక్కువగా విక్రయిస్తారు. దీంతో జనం సంతలకు క్యూ కడుతున్నారు. తక్కువ ధరలో దొరికినప్పుడే కొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గురువారం నిర్వహించిన గొర్రెలు, మేకల సంత కొనుగోలుదారులు, విక్రయదారులతో కిటకిటలాడింది. ఎన్నడూ లేని విధంగా పార్వతీపురం, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి తదితర మండలాల నుంచి పెద్దఎత్తున క్రయ, విక్రయాదారులు వచ్చారు. సరిహద్దు ప్రాంతాలైన ఆంధ్రా, ఒడిశాలో జరిగే పెద్ద సంతల్లో ఇది ఒకటి. దీంతో ఒడిశా నుంచి కూడా పెద్ద సంఖ్యలో జనం సంతకు వచ్చారు. ఈ సంతలో గొర్రెలు, మేకలు భారీగా అమ్ముడుపోయాయి.



జనంతో కిటకిటలాడుతున్న సంత



డెంకాడ పోలీసు స్టేషన్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

సైబర్ నేరాలపై దర్యాప్తు వేగవంతం

- ఎస్పీ వకుల్ జిందాల్

డెంకాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు సంబంధించి నమోదైన కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ ప్రాంగణమంతా కలియతిరిగి పరిశీలించారు. పోలీసు బిల్డింగ్‌లోని గదులు, ప్రాపర్టీ రూం, లాకప్ గదులను పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో సీజ్‌చేసిన వాహనాలను పరిశీలించి.. ఏయే కేసుల్లో సీజ్ చేశారో అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖ రూపొందించిన సందేశాత్మక వీడియోలను క్షేత్రస్థాయిలో ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామ సందర్శనలు తరచూ చేయాలని, గ్రామాల్లో పల్లెనిద్ర చేపట్టాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను గుర్తించి నియంత్రించాలని ఆయన ఆదేశించారు. పేకాట, కోడిపందాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. అనంతరం రిసెప్షన్ రిజిస్టర్‌ను పరిశీలించి ఫిర్యాదులను ఏ విధంగా నమోదు చేస్తున్నదీ తెలుసుకున్నారు. నూతనంగా ఇచ్చిన కంప్యూటర్స్‌ను పరిశీలించి వాటిని సక్రమంగా వినియోగించాలని సూచించారు. విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, స్థానిక ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు, ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉద్యాన శాఖ డీడీగా చిట్టిబాబు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టరుగా కె.చిట్టిబాబును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో అసిస్టెంట్ డైరెక్టరుగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు డీడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

భోగాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరత లేకుండా చూడాలని ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ అసిస్టెంట్ ఫీల్డ్ మేనేజర్ జగదీష్ మిశ్రాకు మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సూచించారు. శ్రీకాకుళంలో నిర్వహించే కార్యక్రమానికి బంగార్రాజుకు ఆహ్వానం పలికేందుకు జగదీష్ గురువారం పోలిపల్లి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు నాణ్యమైన ఎరువులు సరఫరా చేయాలని సూచించారు.

రేగిడిలో భారీ వర్షం

రేగిడి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. రేగిడి, ఆమదాలవలస, చిన్నయ్యపేట, సంకిలి, బొడ్డవలస, మజ్జిరా మునిపేట గ్రామాల్లో వర్షం పడి వీధులు, రోడ్లు జలమయం అయ్యాయి.

ఆక్రమణదారులకు నోటీసులు

గజపతినగరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టయ్యవలస జంక్షన్ వద్ద ఆర్‌అండ్‌బీ స్థలంలో కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారు. దీంతో ఆర్‌అండ్‌బీ జేఈ అజయ్‌భార్గవ్, వీఆర్వో రాజేష్ గురువారం ఆ ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. ఆర్‌అండ్‌బీ స్థలంలో వేసిన గ్రావెల్‌ను తక్షణమే తొలగించాలన్నారు. సర్వే నెంబర్16లో రెవెన్యూలో జరిగిన ఆక్రమణ స్థలం ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉందని అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

రాజాం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెమో-57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఎం.రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాటిపూడి నీరు విడుదల

గంట్యాడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయిర్ నీటిని గురువారం రాత్రి కిందకు విడిచి పెట్టారు. నీటి మట్టం గరిష్ఠంగా 297 అడుగులు కాగా, ప్రస్తుతం జలాశయం నీటి మట్టం 295 అడుగులకు చేరడంతో, ఇన్‌ఫ్లో 480 క్యూసెక్కులు రావడంతో స్పిల్‌వే గేటు తెరిచి గోస్తని నదిలోకి సుమారు 100 కూసెక్కుల వరద నీటిని నదిలోకి విడిచిపెట్టినట్లు తాటిపూడి ఏఈ శంకర్ తెలిపారు.

లారీ బోల్తా

లక్కవరపుకోట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సంతపేట జంక్షన్‌కు సమీపంలో జగనన్న కాలనీ దగ్గర కొత్తవలస నుంచి ఎస్.కోట వైపు వెళ్తున్న మార్గంలో గురువారం మధ్యాహ్నం లారీ బోల్తా పడింది. వేగంగా వెళ్తూ బోల్తా పడిందని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి, కేసు నమోదు చేశారు.

కళా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

నెల్లిమర్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకతను, కళా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రామకృష్ణారావు అన్నారు. కళాశాలలో రెండు రోజులపాటు జరగనున్న కళాఉత్సవ్-2025 సాంస్కృతిక పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. కళా ఉత్సవ్ నోడల్ అధికారి వాక చిన్నంనాయుడు మాట్లాడుతూ ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 23 పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు 7 విభిన్న అంశాలలో పాల్గొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలపై హర్షం

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలందరికీ మేలుచేసే విధంగా నూతన జీఎస్టీ సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ అన్నారు. నూతన జీఎస్టీ సంస్కరణలకు శ్రీకారం చుట్టినందుకు ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఫొటోలకు గురువారం స్థానిక కోట జంక్షన్‌లో పాలభిషేకాలు చేశారు. పార్టీ నాయకుడు పతివాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుకు గండి కొట్టారు

గజపతినగరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పిడిశీల గ్రామంలో కలుషిత నీటితో నిండిన చెరువుకు రెవెన్యూ శాఖ అధికారులు గురువారం గండి కొట్టి, కలుషిత నీటిని బయటకు విడిచిపెట్టారు. ఈ చేపల చెరువు నీరు కలుషితం కావడంతో గ్రామంలోని ప్రజలు అనారోగ్యానికి గురయ్యారు. బోరుబావుల ద్వారా వచ్చే నీరు కూడా కలుషితం కావడంతో గ్రామస్థులు ఇటీవల కలెక్టర్, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మత్స్య శాఖ ఏడీ వెంకటేశ్వరరావు, రెవెన్యూ శాఖ ఆర్‌ఐ అప్పలరాజు, వీఆర్వో శ్రీదేవి గురువారం ఆ చెరువు వద్దకు చేరుకున్నారు. పోలీసుల సహకారంతో యంత్రాలతో చెరువుకు గండి కొట్టి కలుషిత నీటిని బయటకు వదిలారు.

శిలాఫలకంతోనే సరి..

● ప్రారంభంలోనే నిలిచిపోయిన గూడెపువలస సచివాలయం పనులు

భోగాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గూడెపువలస గ్రామంలో సచివాలయ నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమయ్యింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గూడెపువలస గ్రామానికి సచివాలయం మంజూరయ్యింది. అప్పట్లో వైసీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. కొంత కాలానికి కాంక్రీట్ స్తంభాల ఏర్పాటుకు గోతులు తీసి, గజాలు కూడా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఆ పనులు నిలిచిపోయాయి. ఈక్రమంలో ప్రభుత్వం మారడంతో సచివాలయం శంకుస్థాపనకే పరిమితం అయ్యింది. ప్రస్తుతం ఈ సచివాలయాన్ని గ్రామంలోని పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్నారు. ఇరుకు భవనంలో సిబ్బంది ఇబ్బంది పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఆ పంచాయతీ భవనం కూడా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. ఈ సచివాలయ భవన పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో.. అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.



సచివాలయ నిర్మాణానికి వేసిన శిలాఫలకం, పక్కన దర్శనమిస్తున్న గజాలు

ఆపద్బాంధవుడు లోకేశ్

చీపురుపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న వారిని మన దేశానికి రప్పించడంలో ఎనలేని కృషి చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆపద్బాంధవుడిగా నిలిచారని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాధితులను కాపాడడం కోసం ఆయన అనంతపురంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాన్ని కూడా పక్కన పెట్టారన్నారు. ఆపదలో ఉన్న వారిని కాపాడి, వారిని వారి ఇళ్లకు చేర్చడంలో లోకేశ్ చూపిన చొరవ ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు.

ఆయన కృషి అభినందనీయం

రాజాం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నేపాల్‌లోని అల్లర్ల కారణంగా చిక్కుకున్న తెలుగువారిని రాష్ట్రానికి తీసుకురావడానికి మంత్రి నారా లోకేశ్ చేసిన కృషి అభినందనీయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేపాల్‌లో అల్లర్లలో చిక్కుకున్న సుమారు 215 తెలుగు ప్రజలను సురక్షితంగా తిరిగి తీసుకురావడంతో లోకేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.

ఆయన చొరవ అద్వితీయం

శృంగవరపుకోట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌బాబు చొరవతో నేపాల్ అల్లర్లలో చిక్కుకున్న తెలుగు యాత్రికులు క్షేమంగా చేరుకున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ తెలుగు యాత్రికులను క్షేమంగా ఇక్కడకు రప్పించేందుకు లోకేశ్‌బాబు తీసుకున్న చొరవ ఎంతో అద్వితీయమైందన్నారు.

నేపాల్ యాత్రికులకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న రామ్‌మల్లిక్ నాయుడు

విజయనగరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తీర్థ యాత్రలకు చీపురుపల్లి నుంచి నేపాల్‌కు వెళ్లిన పలువురు యాత్రికులు గురువారం రాత్రి ఎయిర్‌పోర్టుకు చేరుకోగానే, ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు వారిని ఆహ్వానించారు. క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. ప్రభుత్వం తీసుకున్న చొరవను వారు ఆయనకు వివరించి, హర్షం వ్యక్తం చేశారు.

పామాయిల్‌తో అధిక ఆదాయం

గజపతినగరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సీహెచ్ చంద్రశేఖర్ అన్నారు. లోగిస గ్రామంలో గురువారం ఆయన పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం వంద శాతం రాయితీపై మొక్కలు అందజేస్తుందని చెప్పారు. పంటసాగుతో పాటు అంతర పంటల నిర్వహణకు ఏడాదికి రూ.1,500 చొప్పున నాలుగేళ్లు అందజేస్తుందని చెప్పారు. ఉద్యాన వన శాఖ అధికారి దీప్తి, వీఏఏలు పాల్గొన్నారు.

మా శ్మశానవాటికకు రాకుండా ఆదేశాలు ఇవ్వండి

కొత్తవలస, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ శ్మశానవాటికలో దహన సంస్కారాలకు రాకుండా అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరక గ్రామస్థులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ తమ్మన్నమెరక గ్రామస్థులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. జోడుమెరక, తమ్మన్నమెరక గ్రామాల మధ్య శ్మశానవాటిక విషయంలో గత కొన్ని ఏళ్లగా వివాదం నడుస్తోంది. ఈక్రమంలో సోమవారం జోడుమెరక గ్రామస్థులు స్థానిక తహసీల్దార్‌ను ఆశ్రయించడంతో తమ్మన్నమెరక గ్రామస్థులు గురువారం కలెక్టర్‌ను ఆశ్రయించారు.

రేషన్ డీలర్లకు ఈ-పోస్ యంత్రాల పంపిణీ

రాజాం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజాం, సంతకవిటి మండలాల రేషన్ డీలర్లుకు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.రాజశేఖర్ కొత్త ఈ-పోస్ యంత్రాలను అందజేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల్లోని క్యూఆర్ కోడ్ వీటితో స్కాన్ చేస్తే ఆ కార్డుదారుల వివరాలు దీనిలో నమోదు అవుతాయన్నాయని తెలిపారు. రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎస్‌డీటీ అనంత్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ధనలక్ష్మి ఎంపిక

నెల్లిమర్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన పతివాడ ధనలక్ష్మి ఎంపికయ్యింది. విజయనగరంలో గురువారం జరిగిన ఎంపిక పోటీల్లో ధనలక్ష్మి 55 కిలోల కేటగిరిలో అండర్-17 విభాగంలో ఎంపికైంది.

రాష్ట్రాభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిలో బ్యాంకర్ల పాత్ర కీలకమని, అందుకు అన్ని బ్యాంకులూ సహకరించాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. ఎల్.కోట ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన నియోజకవర్గ బ్యాంకర్ల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు, మహిళా సంఘాలకు, చిరు వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు రుణాలిచ్చి అభివృద్ధికి సహకరించాలన్నారు. అలాగే ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ రుణాలను కూడా సకాలంలో అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రమణమూర్తి, ఐదు మండలాల బ్యాంకు మేనేజర్లు, సూపరింటెండెంట్ దొర, పశు సం వర్ధక శాఖ ఏడీ కన్నంనాయుడు, విద్యుత్ శాఖ ఏడీ బోని వెంకటరావు, ఏవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



సంతకవిటి: హైజంప్ చేస్తున్న విద్యార్థిని

రేగిడి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అంబాడ వెంకటాపురం హైస్కూల్‌లో గురువారం అండర్ 14, 17 విభాగాల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. తొలిరోజు బాలకలకు సంబంధించి వాలీబాల్, కోకో, రన్నింగ్, చెస్, యోగా తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవోలు వరప్రసాదరావు, బి.ఎరకయ్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సునీత, మండల క్రీడాధికారి ఎన్.సత్యనారాయణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు. ● సంతకవిటి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్జీఎఫ్ సెలక్షన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు పాలకొండలో జరగబోయే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ భుజంగరావు తెలిపారు. ● రాజాం: పొగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి పాఠశాల పోటీలు నిర్వహించారు. హెచ్ఎం పద్మావతి, పీడీ త్రినాథ పాల్గొన్నారు.

క్వాంటమ్ హ్యాకథాన్‌లో జీఎంఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ

రాజాం రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విశాఖలోని గాయత్రీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అమరావతి క్వాంటమ్ హ్యాకథాన్ -2025లో రాజాం జీఎంఆర్ఐటీ విద్యార్థులు తమ ఆవిష్కరణలు ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డా.ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణల్లో పాల్గొన్న రెండు జట్లలో ఫ్యాకల్టీ గణేష్ సారథ్యంలో ఆర్.సాయివివేక్ ఆధ్వర్యంలో క్యూబిట్-ట్రేసర్ ప్రోజెక్ట్‌ను ప్రదర్శించి రూ.10వేల నగదు బహుమతితో పాటు అంతర్జాతీయ సంస్థ అయిన గ్లోబల్ క్వాంటమ్ ఏఈ వారిచే రూ.4వేల నగదు బహుమతిని అందుకున్నారని చెప్పారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మరో విద్యార్థి మోహన్‌చందు పనితీరును ప్రసంశిస్తూ గ్లోబల్ క్వాంటమ్ ఏఐ రూ.4వేలు నగదు బహుమతిని అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

లెండి విద్యార్థులు..

డెంకాడ: జొన్నాడ వద్దగల లెండి కళాశాల విద్యార్థులు అమరావతి క్వాంటం వ్యాలీ హాకథాన్ నార్త్ కోస్టల్ రిజియనల్స్‌లో విజేతలుగా నిలిచారు. ఈ పోటీలు విశాఖలోని గాయత్రీ విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. వాటిలో లెండి నుంచి పాల్గొన్న రెండు బృందాలు విజేతలుగా నిలిచాయి. డీన్ ఐఐసీ డా.వసంత్ కేవై మార్గదర్శకత్వం, పి.సంగీత మెంటార్‌షిప్‌లో ఈ విజయం వరించినట్టు వారు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డా.హరిబాబు విజేతలను అభినందించారు.

అర్హులందరికీ వాహనమిత్ర ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు

రాజాం రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉన్న అర్హులైన ఆటో డ్రైవర్లందరికీ గత ఏడాదితో కలిపి వాహనమిత్ర పథకం అందజేయాలని రాజాం ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, అధ్యక్షుడు కోటి నారా యణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాజాంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా ప్రకటించడం అభినందనీయం అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాజాం తహసీల్దార్ రాజశేఖర్‌కు అందజేశారు.


ఆక్రమణల తొలగింపు

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద ఉన్న ఆక్రమణలు, తాత్కాలిక నిర్మాణాలను నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశాలతో ప్రణాళిక సిబ్బంది అధికారులు గురువారం తొలగించారు. గత కొద్ది రోజులుగా ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి స్వచ్ఛందంగా తరలివెళ్లాలని సూచించినప్పటికీ కొంత మంది నిర్లక్ష్యంగా ఆక్రమణలను తొలగించలేదు. దీంతో అధికారులు పోలీసు బ్యారక్స్ గేటు నుంచి గ్యాస్ గొడౌన్ వరకు ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఆసుపత్రికి ఇరువైపులా ఉన్న ఆటో స్టాండ్‌ను నిర్దేశిత ప్రాంతంలో మాత్రమే ఆటోని నిలుపుకునే విధంగా చూడాలని అసిస్టెంట్ సిటీప్లానర్ రమణమూర్తి డ్రైవర్లకు సూచించారు.

ఉపాధ్యాయుల నిరసన వారం ప్రారంభం

నెల్లిమర్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ తలపెట్టిన నిరసన వారంలో భాగంగా తొలిరోజు గురువారం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57ను తక్షణం అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు యాప్‌ల బాధ్యతల నుంచి తప్పించాలని, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీలో జిందాల్ నిర్వాసితుల శాంతియుత పోరాటం



జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామానికి చెందిన జిందాల్ నిర్వాసితులు రెండురోజు గురువారం ఢిల్లీలో శాంతియుత పోరాటం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఢిల్లీలోని ఖాన్ మార్కెట్ వద్ద ఉన్న లోకాయుక్త భవన్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానను కలిసి, వినతిపత్రం అందజేశారు. అనంతరం మహాత్మా గాంధీ సమాధి వద్దకు వెళ్లి వినతిపత్రం అందించారు. ● బొడ్డవరలో గురువారం జిందాల్ నిర్వాసితులు నిరసన చేపట్టారు. గతంలో సేకరించిన జిందాల్ భూముల్లో ప్రస్తుత ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుచేస్తామని ప్రకటన చేస్తుందని, అయితే ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని కోరారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

గంట్యాడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ పీవో ఉమాభారతి సూచించారు. గురువారం మదనాపురం ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంకల్పంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు. ● శృంగవరపుకోట: నేటి సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్.కోట ఐసీడీఎస్ పీవో అచ్యుత కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ● కొత్తవలస: బాలికలు విద్య, వైద్యం, న్యాయం, రక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధి కె.రమాదేవి తెలిపారు. గురువారం కొత్తవలస జడ్పీ హైస్కూల్‌లో ఆమె అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● మెకరముడిదాం: మిషన్‌శక్తి, మిషన్ వాత్సల్యపై అవగాహన కలిగి ఉండాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ పర్యవేక్షకురాలు తాడ్డి శ్రీదేవి అన్నారు. గురువారం భైరిపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన సంకల్ప సదస్సులో ఆమె పాల్గొని, అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● డెంకాడ: బాల్య వివాహాలు చేసి, పిల్లల భవిష్యత్తు నాశనం చేయొద్దని భోగాపురం సీడీపీవో లావణ్య తెలిపారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిని ఆధ్వర్యంలో ఆమె అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ● భోగాపురం: బాల్య వివాహాలను నిర్మూలించాలని ఐసీడీఎస్ పీవో లావణ్య అన్నారు. గురువారం స్థానిక ప్రైవేటు కళాశాలలో ఆమె అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇంజక్షన్ వికటించి వివాహిత మృతి

● పరారైన పీఎంపీ

● ఆందోళన చేసిన కుటుంబ సభ్యులు

కొత్తూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండల కేంద్రం కొత్తూరులోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి ఓ వివాహిత మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం ఘనసర గ్రామానికి చెందిన తేజాలమ్మ(53) తన భర్త తవుడుతో కలిసి గురువారం మధ్యాహ్నం చికిత్స కోసం కొత్తూరు నాలుగు రోడ్ల జంక్షన్‌లో గల శ్రీసాయి ప్రజా వైద్యశాలలో గల వైద్యుడు నాగేశ్వరరావు (పీఎంపీ) వద్దకు వచ్చారు. తనకు కాళ్ల పీకులు, నొప్పులు ఉన్నాయని వైద్యుడుకి వివరించింది. సమస్య విన్న వైద్యుడు నాగేశ్వరరావు ఆమెకు ఇంజక్షన్ చేస్తుండగానే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. ఇది గమనించి వైద్యుడు ఆమె పరిస్థితి విషమంగా ఉందని, తక్షణమే వేరే ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలని ఆమె భర్తకు చెప్పి తప్పించుకోవాలనుకున్నాడు. వైద్యుడి కపటితనాన్ని గుర్తించిన ఆమె భర్త తవుడు తన ఎదుటే ప్రాణం విడిసిందని కేకలు వేస్తూ ఏడ్చాడు. దీంతో వైద్యుడు మృతదేహాన్ని బెడ్‌పైనే ఉంచేసి ఆసుపత్రికి తాళాలు వేసి వెళ్లిపోయాడు. ఈ విషయం మృతిరాలి కుటుంబ సభ్యులకు తెలియడంతో వారంతా ఆసుపత్రి వద్దకి చేరుకుని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ సీహెచ్ ప్రసాద్, ఎస్ఐ ఎండీ అమీరు ఆలీ సిబ్బంది తో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి అదుపులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో కలెక్టర్, ఎస్పీలు స్పందించి తక్షణమే నివేదికలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో కురిగాం ఆసుపత్రి వైద్యులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి నివేదిక ఉన్నతాధికారులకు అందించినట్టు తెలుస్తుంది. ఆసుపత్రి ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయా? లేవా? వంటి విషయాలపై ఆరా తీస్తున్నారు. ఆసుపత్రి వద్ద సుమారు నాలుగు గంటల పాటు హైడ్రామా నడిచింది. బాధితులకు న్యాయం చేసేందుకు వైద్యుడితో రాజీ కుదిర్చేందుకు పలువురు ప్రయత్నించినా ఫలించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించేందుకు పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కాగా తేజాలమ్మకి భర్త తోపాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరంతా ఇతర ప్రాంతాల్లో ఉంటూ జీవనోపాధి పొందుతున్నారు. తవుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు.

పెట్రోల్ బంకు వద్ద ఘర్షణ

చీపురుపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ రోడ్డులో పాత పెట్రోల్ బంకు వద్ద గురువారం రాత్రి ఘర్షణ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన తమ్మిన వెంకటేష్ అనే వ్యక్తి గురువారం రాత్రి తన ద్విచక్ర వాహనానికి పాత పెట్రోల్ బంకులో రూ.500 పెట్రోల్ వేయించారు. అయితే, వేసిన పెట్రోల్‌కు తగినట్టుగా వాహనం మైలేజీ రాకపోవడంతో, బంకుకు వచ్చి ఫిర్యాదు చేశారు. వాహనంలోని పెట్రోల్ వేరే బాటిల్‌లోకి తీసి పరిశీలించారు. ఆ బాటిల్ అడుగు భాగంలో నీరు చేరడంతో, సిబ్బందిని నిలదీశారు. అదే సమయంలో కొంతమంది ఆటో డ్రైవర్లు కూడా ఇదే రకమైన ఫిర్యాదు చేయడంతో, అక్కడ ఘర్షణ జరిగింది. సమాచారం అందుకున్న ఎస్ఐ దామోదరరావు బంకు వద్దకు చేరుకుని ఇరు వర్గాల వారిని స్టేషన్‌కు తరలించడంతో, వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

సకాలంలో జీతాలు చెల్లించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నెల్లిమర్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాలు సకాలంలో చెల్లించాలని ఆ సంఘం జేఏసీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆరికతోట రామకృష్ణ, లెంక సంతోష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవిని కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రతి ఏడాది ఒకే బడ్జెట్ కేటాయించడం వల్ల సమగ్రశిక్ష ఉద్యోగులకు ప్రతినెలా జీతాలు సక్రమంగా చెల్లించేవారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ అదే విధానాన్ని ప్రవేశపెట్టి ప్రతినెల 1వ తేదీన జీతాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సమగ్ర శిక్ష ఉద్యోగులకు తక్షణమే జీతాలు పెంచాలని, హెచ్ఆర్ పాలసీ, ఎంటీఎస్ వర్తింపజేయాలని కోరారు.

హోటల్ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హోటల్ అసోసియేషన్ రంగాన్ని రానున్న కాలంలో మరింత బలోపేతం చేసి అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఏపీ హోటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఏపీహెచ్ఏ రాష్ట్ర అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన అనంతరం రాష్ట్రంలో హోటల్ రంగం మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తమ హోటల్ అసోసియేషన్ తరుపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈసందర్భంగా జరిగిన ప్రమాణ స్వీకారంలో కార్యదర్శిగా అనంతపురం జిల్లాకు చెందిన కలమెడి రమణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఒంగోలుకు చెందిన యధపాటి కొండయ్య, కోశాధికారిగా పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన భైలా లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పి.వాసు, సునీల్, జీకే చైతన్యలు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

విజయనగరం రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రాలేదనే ఆక్రోశంతో నిరాధార, అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉపాధ్యాయుడు, యూనియన్ ప్రతినిధి డి.శ్యామ్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు, నాయకుడు చిప్పాడ సూరిబాబులు అన్నారు. గురువారం కణపాక యూత్ హాస్టల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు రాలేదన్న ఉద్దేశంతో శ్యామ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అర్జునుడు, రవి, ఎంఏ స్వామి, ఈశ్వరరావు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో మార్పునకు అనుమతి ఇవ్వాలి

నెల్లిమర్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పైడితల్లి పండుగ ఉన్న నేపథ్యంలో దసరా సెలవుల్లో మార్పు చేయాలని జిల్లా ప్రైవేటు పాఠశాలల యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవికి వినతిపత్రం అందజేశారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోనులో మాట్లాడారు. వారు సానుకూలంగా స్పందించి డీఈవోతో మాట్లాడి కమిషనర్ దృష్టికి కూడా తీసుకువెళ్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈ పండగ సెలవులు ప్రతి ఏడాది అధికారికంగా ఇచ్చేలా కృషి చేస్తానని ఆమె మాట ఇచ్చారు. యూనియన్ జిల్లా కార్యదర్శి చందక రమేష్, నియోజవకర్గ అధ్యక్షుడు వసాది సూరిబాబు, నాలుగు మండలాల ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

రైతులను మోసం చేశారు

రాజాం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక రామనారాయణ ఏజెన్సీ తమను మోసం చేసిందని గడిముడిదాం గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రామనారాయణ ఏజెన్సీ వద్ద గడిముడిదాం, అమరాం, దోసరి, రామినాయుడువలస గ్రామాలకు చెందిన 150 మంది రైతులు ఎంటీయూ 1001 వరి విత్తనాలు కొనుగోలు చేయడానికి వెళ్తే.. గంగోత్రి విత్తనాలు ఇచ్చారు. దీనిపై పలువురు రైతులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డాట్‌సెంటర్ కోఆర్డినేటర్ లక్ష్మణరావు, శాస్త్రవేత్తలు ఉదయభాను, మధుబాబు గురువారం ఆ పంటలను పరిశీలించారు. రైతులకు అన్యాయం జరిగినట్టు తమ పరిశీలనలో తేలిందని వారు చెప్పారు. రైతుల వివరాలతో పాటు నష్టం జరిగిన విషయంపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు, ఏవో చీకటి రఘునాథ్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఏపీజీఈఏ ఎన్నిక

భోగాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో గురువారం నిర్వహించిన ఏపీజీఈఏ కోఆప్షన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా మేరీ, భోగాపురం తాలూకా యూనిట్ ఇన్‌చార్జి జె.మహేశ్వరావు వ్యవహరించారు. ప్రెసిడెంట్‌గా డా.కృష్ణచైతన్య, అసోషియేట్ ప్రెసిడెంట్‌గా పి.రామకృష్ణ, జనరల్ సెక్రటరీగా ఎస్.రామకృష్ణ, ట్రెజరర్‌గా దేవ వాసు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.కృష్ణ, వైస్ ప్రెసిడెంట్లుగా శ్రీకాంత్, హనుమంతరావు, డా.భాగ్యరేఖ, కె.నారాయణస్వామి నియమితులయ్యారు.

ఎన్నాళ్లీ నరకం?

(5వ పేజీ తరువాయి)

యార్డుతో గోపసాగరం సైతం కలుషితమవుతుంది. గోపసాగరం కింద సుమారు 150 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే, నీరు కలుషితం అవుతుండడంతో వరి దిగుబడులు తగ్గుతున్నాయని రైతులు అంటున్నారు. 2023లో కలుషిత నీటితో గోపసాగరంలో సుమారు రూ2 లక్షల విలువ చేసే చేపలు చనిపోయాయని మత్స్యకారులు చెబుతున్నారు. అంతే కాకుండా కలుషితమైన నీటిలో బట్టలు ఉతకలేకపోతున్నామని రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డంపింగ్ యార్డును తరలించాలని కోరుతున్నారు.

యార్డు తరలించాలి

డంపింగ్ యార్డుతో రైతులు, మత్స్యకారులు, రజకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గోపసాగరం కాలుష్యం బారిన పడుతుంది. యార్డును ఇక్కడి నుంచి తరలించాలని పాలకులు, అధికారులకు విన్నవించు కున్నా ఫలితం శూన్యం. కలెక్టర్ స్థాయి వరకు ఈ సమస్యను తీసు కువెళ్లినా పరిష్కారం చూపలేదు. ఇకపైనా డంపింగ్ యార్డును తరలించాలి.

-చుక్క చంద్రరావు, గోపసాగరం ఆయకట్టు రైతు, పార్వతీపురం

భూగర్భ జలాలు కలుషితం

డంపింగ్ యార్డుతో మా కాలనీలో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. బోర్ల నుంచి వస్తున్న నీరు దుర్వాసన వెదజల్లుతుంది. వారం రోజులకొకసారి మున్సిపల్ కొళాయి నుంచి నీరు వస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో బోరు నీటిని తాగుతున్నాం. దీనివల్ల కొన్నిసార్లు డయేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నాం.

-జి.రవికుమార్, వివేకానందకాలనీ, పార్వతీపురం

ప్రత్యేక దృష్టి సారించాం

డంపింగ్ యార్డు తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యంగా చెత్త నుంచి సంపద సృష్టించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే విశాఖపట్నానికి చెందిన ఓ ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థతో చర్చించాం. గోపసాగరం కలుషితం కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం.

-శ్రీనివాసరాజు, కమిషనర్, పార్వతీపురం మునిసిపాలిటీ

నిధులు మంజూరైనా.. నత్తనడకనే!

(5వ పేజీ తరువాయి)

విద్యుత్‌శాఖ చేయాల్సిన పనులే మిగిలి ఉన్నాయంటున్నారు. ఏదేమైనా నూతన భవనాలను త్వరగా వినియోగంలోకి తేవాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు. దీనిపై ఏపీఎంఎస్ఐడీసీ డీఈఈ ప్రసన్నకుమార్‌ను వివరణ కోరగా.. 'ఆసుపత్రుల నూతన భవన నిర్మాణాలు పూర్తి చేసేశాం. ఇంకా విద్యుత్‌కు సంబంధించిన పనులు ఉన్నాయి. వాటిని త్వరగా పూర్తి చేయిస్తాం.' అని తెలిపారు.

యూటీఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

సాలూరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరుతూ యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి పోస్టర్‌ను గురువారం కరకవలస వద్ద ఆ యూనియన్ జిల్లా అసోసియేట్ సభ్యుడు బోడెల విజయకుమార్, నేతలు రాజమణి, ఏవీ రామారావు, అనకాపల్లి గణేష్, అల్లు మన్మథరావు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోడెల విజయకుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బకాయిల చెల్లింపులో తాత్సారం చేయడం తగదన్నారు. ఉపాధ్యాయులపై ఆన్‌లైన్ పనులు, యాప్‌ల, అసెస్మెంట్ పుస్తకం విధానంతో ఒత్తిడిని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోండి

పార్వతీపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఎన్‌సీడీ 4.0లో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌పై సీహెచ్‌వో, ఏఎన్ఎంలకు గురువారం ఎన్‌జీవో హోంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ శోభారాణి, డెంటల్ వైద్యులు డాక్టర్ సుకృత పవర్ ప్రెజెంటేషన్ చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మక్కువ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్కొండపుట్టి, తుండ రహదారి మధ్య కాకునివానివలస సమీపంలో బుధవారం రాత్రి కర్రల లోడుతో వెళుతున్న లారీ విద్యుత్ స్తంభాన్ని తప్పించబోయి రహదారి మధ్యలో కూరుకుపోయింది. పొరపాటున హెచ్‌టీ లైన్‌కు లారీకి తగిలి ఉంటే అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో సహా మరో ఇద్దరికి ప్రాణాలకు ముప్పు వాటిల్లేది. కర్రల లోడుతో లారీ రహదారి మధ్యలో కూరుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఏరియా ఆసుపత్రి మెయిన్‌గేటు మూసివేత

పాలకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏరియా ఆసుపత్రి మెయిన్ గేటును గురువారం నుంచి వారం రోజులు మూసివేస్తున్నట్టు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.చిరంజీవి, ఆసుపత్రుల సమన్వయ అధికారి జి.నాగభూషణరావు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో రోడ్డు పునఃనిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో గేటు మూసివేస్తున్నామని వివరించారు.

ఘనంగా జైగురుదత్త హోమాలు

గరుగుబిల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో అనగాదేవి సహిత జైగురుదత్త హోమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. వీరఘట్టానికి చెందిన ప్రముఖ యజ్ఞ యాగకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో హోమాలు జరిగాయి. కార్యక్రమంలో శ్రీకాకుళం, పాలకొండ, వీరఘట్టాం, పార్వతీపురం, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు.

జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

పాలకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో ఈ నెల 13, 14 తేదీల్లో తలపెట్టిన సీఐటీయూ జిల్లా 11వ మహాసభలను అందరూ జయ ప్రదం చేయాలని శ్రామిక మహిళా సంఘం పాలకొండ ప్రాంత నాయకులు ఎన్.హిమప్రభ పిలుపునిచ్చారు. గురువారం ఆమె పట్టణంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.. కార్యక్రమంలో పద్మ, శ్రీదేవి, రజని, సుశీల, పద్మ, సంతోషి పాల్గొన్నారు.

భాషా వలంటీర్లకు పుస్తకాల పంపిణీ

సీతంపేట రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని జీపీఎస్, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న భాషా వలంటీర్‌లకు గురువారం సవర భాషా పుస్తకాలను పంపిణీ చేశారు. ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 152 మంది సవర భాషా వలంటీర్లకు రూట్ 1, 2, 3 టెక్స్ పుస్తకాలను అందజేసినట్లు జీసీడీవో రాములమ్మ తెలిపారు.

సారా రవాణాకు అడ్డుకట్ట వేయండి



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

కురుపాం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా- ఒడిశా బోర్డర్‌లో సారా రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కురుపాం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సారా తయారీ వివరాలపై ఆరా తీశారు. ఎక్కువగా సారా కేసులు నమోదైన వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని ఆదేశించారు. ఒడిశా ఎక్సైజ్ అధికారులను సంప్రదించి సరిహద్దు ప్రాంతంలో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జయకృష్ణ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రమా సత్యనారాయణ కల్యాణ మండపంలో గురువారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల కూటమి నాయకులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. అలాగే జిల్లాలోని వివిధ శాఖ అధికారులు, ఐటీడీఏలోని అన్ని శాఖల ఉద్యోగులు పాలకొండ సబ్ డివిజన్‌లోని ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు హాజరయ్యారు. ఎమ్మెల్యేను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తూర్పుకాపు రాష్ట్ర అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, ఎంపీపీ బొమ్మాళి భాను, కూటమి నాయకులు పల్లా కొండలరావు, కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్ కుమార్, జాడ శ్రీధర్, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, గండి రామినాయుడు, గర్భాన సత్తిబాబు, వెన్నపు శ్రీనివాసరావు, సుంకరి అనీల్‌దత్, దూబ వెంకటరమణ, కె.చౌదరినాయుడు, సుధాకర్, వాకమూడి అనీల్‌కుమార్, నవీన్ పాల్గొన్నారు.

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ జన్మదినం సందర్భంగా మండలంలోని వాటపాగు గ్రామానికి చెందిన జనసేన నాయకులు కె.పోలినాయుడు ఏరియా ఆసుపత్రిలోని రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ గురువారం చేశారు. అలాగే సబ్‌జైలులో ఖైదీలకు పండ్లను అందజేశారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

పాలకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేయాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రశాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం వెంకమ్మపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాసపు వాసుదేవరావు, గోగుల సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బి.వి.రమణ, జిల్లా కార్యదర్శి కె.పద్మజ, గౌరవ అధ్యక్షుడు టెంకాయల ఉమామహేశ్వరరావు, సబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

●సాలూరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం ఏపీటీఎఫ్ (257) పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ వివిధ డిమాండ్ల సాధనకు నిరసన వారం పాటించడానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో తొలిరోజు నల్లబ్యాడ్జీలు ధరించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున ఉపాధ్యాయుల నుంచి స్పందన వచ్చిందని ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల బాలకృష్ణ తెలిపారు.

●కురుపాం, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కురుపాంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో వారం రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శి ఎ.జగదీశ్వరరావు, ఉపేంద్ర, హెచ్‌ఎం తోట శంకరరావు, భమిడిపాటి మూర్తి పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోండి



ఆందోళన చేస్తున్న గిరిజనులు

పాలకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ పంటలను నాశనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జియమ్మవలస మండలం గడసింగుపురం పంచాయతీ గడసింగుపురం, ఏనుగులగూడ గిరిజనులు డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 40 ఎకరాల భూమిలో 15 ఏళ్లుగా నుంచి వివిధ పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ భూమిలో 30 ఎకరాలకు డి పట్టాలు ఉన్నాయన్నారు. ఇటీవల దఫదఫాలుగా సంతనర్సిపురం గ్రామానికి చెందిన కొత్తూరు పార్వతమ్మ, కర్రి జయలలిత, కర్రి చిన్నమ్మలు, గొర్లె గౌరమ్మ, వారాడ రాము, గంట జగన్నాథం, గంట అలివేలు మాపై దౌర్జన్యం చేస్తూ కులం పేరుతో దూషిస్తున్నారన్నారు. గతంలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు ఈనెల 9న మా భూముల్లోని పత్తి, జీడి మొక్కలను నాశనం చేశారన్నారు. వారిని కఠినంగా శిక్షించాలని గిరిజనులు డిమాండ్ చేశారు.

క్వారీ అనుమతులు రద్దు చేయాలి

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దబొండపల్లి, హెచ్.కారాయివలస రెవెన్యూ పరిధిలోని ఎలుగుల మెట్టపై మైనింగ్ క్వారీ అనుమతులు రద్దు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. దీనివల్ల వందలాది ఎకరాల పంట భూములు నష్టపోవడమే కాకుండా పశువుల పెంపకందారులు ఇబ్బందులు పడతారన్నారు. గురువారం ఎలుగులమెట్టను వారు పరిశీలించారు. కొండపై మైనింగ్ చేపట్టేందుకు ప్రభుత్వం వెంకటసాయి గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు జారీ చేసినట్టు తెలుస్తోందన్నారు. అధికారులు, నాయకులు తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయాన్ని చేపట్టడాన్ని వారు తప్పుబట్టారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే క్వారీ నిర్వహణను అడ్డుకుంటామన్నారు. పరిశీలనలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుమార్, నాయుడు, దుర్గారావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, సంతోష్ సీతారాం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భామిని, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఘనసర గ్రామానికి చెందిన కిల్లారి తేజాలు (56) కొత్తూరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు చేశారు. తేజాలుకు కండరాలు బిగిసిపోయి అస్వస్థతకు గురికావడంతో ఆమెను కొత్తూరు ప్రైవేట్ ఆసుపత్రికి చేర్చారు. చికిత్స అందించిన గంటలోనే మృతి చెందడంతో ఆందోళనకు దిగారు. దీనిపై కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏచూరికి ఘన నివాళి

సీతానగరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎర్రజెండానే ఆయుధంగా మలుచుకుని పోరాటం చేసిన సీతారాం ఏచూరి జాతీయ స్థాయి పోరాట యోధుడని సీపీఎం జిల్లా నాయకుడు ఆర్.వేణు అన్నారు. మండల కేంద్రంలో గురువారం సీపీఎం పార్టీ మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో ఆర్.సత్యనారాయణ, రెడ్డి లక్ష్మునాయుడు, రామారావు, బి.అప్పారావు, సీహెచ్. కృష్ణ, రమణమూర్తి ఉన్నారు.

జేసీని కలిసిన మిల్లర్ల అసోసియేషన్



జేసీని సత్కరిస్తున్న మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు

గరుగుబిల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాకు నూతనంగా నియామకమైన జేసీ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డిని గురువారం మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు బి.రామ్‌మోహనరావు, ఎ.మధుసూదనరావు మర్యాదపూర్వకంగా కలిశారు. జేసీని వారు సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మిల్లర్ల అసోసియేషన్ పరిధిలోని పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రభుత్వపరంగా మిల్లర్లకు అందాల్సిన బకాయిలను అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జేసీని కలిసిన వారిలో ప్రతినిధులు పి.శేషు తదితరులు ఉన్నారు.

ప్రతి విద్యార్థి భవిష్యత్‌ను తీర్చిదిద్దండి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

కొమరాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని డీఈవో రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని వివిధ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కోటిపాం, కొమరాడ హైస్కూల్, గుమడ ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ, గురుకుల పాఠశాలను సందర్శించారు. ఇటీవల జరిగిన ఎఫ్ఏ-1 పరీక్షలకు సంబంధించి మార్కులపై ఆరా తీశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో జామి నారాయణస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాల ప్రధానాచార్యుడు డి.లక్ష్మణరావును జిల్లా విద్యాశాఖాధికారి రాజ్‌కుమార్ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ లక్ష్మణరావుకు అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో కొమరాడ ఎంఈవో నారాయణస్వామి, ఏపీవో శంకరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధన చేపట్టండి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో

కొమరాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రీస్కూల్ విద్యార్థులకు చక్కగా విద్యాబోధన చేపట్టాలని కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి అన్నారు. గురువారం కొమరాడ ప్రాజెక్టు కార్యాలయం వద్ద మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు విద్యాబోధన, రక్తహీనత నివారణ కోసం న్యూట్రీషిన్ ఫుడ్‌పై అవ గాహన కల్పించారు. కార్యక్రమం లో జిల్లా ప్రథమ జిల్లా కో-ఆర్డినేటర్ జీవిత, సూపర్‌వైజర్లు శారదాంబ, లక్ష్మీ, బంగారమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

ఎరువుల సరఫరాపై వాస్తవాలు గుర్తించండి

●ప్రభుత్వ విప్ జగదీశ్వరి



గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎరువుల లభ్యత, సరఫరాపై ప్రజలు వాస్తవాలను గుర్తించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. గురువారం ఆమె నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఐదేళ్లు రైతుల కష్టాలను పట్టించుకోని జగన్ ఇప్పుడు రైతుల పేరు చెప్పడం డ్రామాలు ఆడుతున్నారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ కోసం రాష్ట్రంలో 6.91 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపు జరిగిందన్నారు. ఇప్పటివరకు రైతులు 6.11 లక్షల మెట్రిక్ టన్నులను వినియోగించారన్నారు. గతేడాది సెప్టెంబర్ 10 వరకు 5.6 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయగా, ఈ ఏడాది అదనంగా 1.04 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా రైతులు కొనుగోలు చేశారన్నారు. త్వరలోనే మరో 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా చేరనుందన్నారు. 45 కేజీల బస్తాను రూ. 250లకే ఇస్తున్నామన్నారు. దీనిపై రూ.1900 సబ్సిడీని కేంద్రం భరిస్తోందని వివరించారు. రబీ సీజన్ కోసం 9.38 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ప్రభుత్వమే సిద్ధం చేస్తుందన్నారు. ఇప్పుడు వైసీపీ రైతుల పేరుతో నాటకాలు ఆడుతూ వారిని తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తోందని ఆమె మండిపడ్డారు.

యూరియాపై ప్రత్యేక దృష్టి

గరుగుబిల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులను అందించేందుకు అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నట్లు కార్పొరేషన్ డైరెక్టర్లు అక్కేన మధుసూదనరావు, అంబటి రాంబాబు తెలిపారు. గురువారం సంతోషపురంలో వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల పరిధిలో రెండు విడత లుగా యూరియా, డీఏపీలు సరఫరా జరిగాయన్నారు. పలు గ్రామాల్లో రైతులకు అవసరమైన యూరియా విషయమై ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. అవసరమైన నిల్వలను కేటాయించేందుకు హామీ ఇచ్చారన్నారు. యూరియాకై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియా సరఫరాపై రైతులను వైసీపీ తప్పుతోవ పట్టించడాన్ని వారు ఖండించారు. సమావేశంలో కురుపాం ఏఎంసీ డైరెక్టర్ అంబటి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కేసుల రాజీకి ప్రయత్నించండి

పాలకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ ఈనెల 13న నిర్వహించనున్న నేపథ్యంలో కక్షిదారులు వినియోగించుకోవాలని పాలకొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి హరిప్రియ పిలుపునిచ్చారు. గురువారం న్యాయవాదులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను సూచించాలన్నారు. కేసుల రాజీ ద్వారా కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. సమావేశంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మనమిత్ర సేవలను వినియోగించుకోండి

సాలూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మనమిత్ర వాట్సాప్ సేవలను మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ వాట్సాప్ నెంబరు 9552300009ను మన మిత్ర పేరుతో సేవ్ చేసుకోవాలని కోరారు. ఆ నెంబరుకు హాయ్ సందేశం పంపడం ద్వారా చాట్ ప్రారంభించ బడుతుందన్నారు. మీకు కావాల్సిన సేవలను ఎంపిక చేసుకోవాలన్నారు.

పాఠశాలలకు విద్యా సామగ్రి పంపిణీ

సాలూరు రూరల్/పాచిపెంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మూడు, నాలుగు, ఐదు తరగతి విద్యార్థులకు టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ కార్యక్రమానికి సంబంధించి సాలూరు, పాచిపెంట మండలాల క్లస్టర్ కాంప్లెక్స్‌ల్లో మెటీరియల్‌ను గురువారం అందజేశారు. ప్రాథమిక పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమానికి సంబంధించి బోధన సామగ్రిని ప్రభుత్వం పంపించింది. ఒకటి,రెండు తరగతి విద్యా ర్థులకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి సంబంధించిన బోధన సామగ్రిని సైతం అందజేశారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

వీరఘట్టం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎం.రాజపురంలో గురువారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మొక్కలను నాటారు. వీరఘట్టం రోడ్డు ఎం.రాజపురం జంక్షన్ నుంచి గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ జిల్లా అధికారి ప్రసూన, రేంజ్ అధికారి రామారావు, డీ ఆర్‌వో రమణమూర్తి, ఉపాధి హామీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

సాలూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 26వ వార్డు వెంకటేశ్వరకాలనీలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్వర్టు నిండిపోయి కాలువ మూసుకుపోవడంతో మురుగునీరు కాలనీలో నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడడంతో స్పందించిన మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ కాలువలో పూడికతీత పనులు చేయించారు. పనులను ఆయన పర్యవేక్షించారు.